క్లుప్తంగా

మున్సిపల్ అభివృద్ధికి కృషి

చైర్‌పర్సన్ హేమలత


పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్

తుక్కుగూడ: పురపాలక సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తాన్నానని చైర్‌పర్సన్ బరిగేల హేమలత రాజుగౌడ్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ కేంద్రంలోని 9వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోడ్డు పనులను నాణ్యతంగా చేపట్టాలన్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా మిగిలిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు జపాల భావన, వై.శివకుమార్, ఆర్.రాజు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామికి అభిషేకం


ప్రత్యేకాలంకరణలో స్వామివారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జిన్నాయిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ఇష్ట మైనరోజు కావడంతో అభిషేకం, పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు అజయ్‌శర్మ, మురళీశర్మ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటస్వామికి నివాళి


నివాళులర్పిస్తున్న మేయర్, మున్సిపల్ సిబ్బంది

బడంగ్‌పేట్: కార్పొరేషన్ కార్యాలయంలో గడ్డం వెంకటస్వామి జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ రఘు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటస్వామి(కాకా) చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. పేద ప్రజల కోసం ఆయన చేసిన పోరాట ప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతామెడోస్ కాలనీ అధ్యక్షుడిగా నరేందర్‌రెడ్డి



బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 29వ డివిజన్ సీతామెడోస్ కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం కాలనీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం కాలనీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్దబావి నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా రామారావు, మల్లేశ్, ప్రధాన కార్యదర్శి రాథోడ్ సుభాష్, కోశాధికారిగా రామకృష్ణారెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రాముడు, గౌరవ సలహాదారులుగా జగన్నాథం, వీరనారాయణ, పీతాంబరం, కార్యవర్గ సభ్యులుగా మురళీకృష్ణ, కాంతికుమార్, వంశీగౌడ్, రామును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడోసారి ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు కాలనీవాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు తీసుకెళ్తానన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

కల్యాణం.. కమనీయం



పహాడీషరీఫ్: మామిడిపల్లి బాలాజీ లలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం కనుల పండువగా కొనసాగింది. ఉదయం బాలభోగము, హవనము, బలిహరణం అనంతరం ఉత్సవ మూర్తుల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి కల్యాణాన్ని జరిపించారు. ఈ కల్యాణ మహోత్సవంలో మామిడిపల్లి, పహాడీషరీఫ్, జల్‌పల్లి, శ్రీరాం కాలనీ, కాటేదాన్, శంషాబాద్, మైలార్‌దేవ్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. పూజల అనంతరం అన్నప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం 5 గంటలకు స్వామివారిని మామిడిపల్లి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారికి హారతి సమర్పించారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం మూడోరోజు శ్రీగాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తజనం అమ్మవారికి, పరమశివుడికి ప్రత్యేక పూజలు చేశారు. సుప్రభాత సేవ, అభిషేకం, సహస్రనామార్చన, శ్రీగాయత్రీదేవి హోమం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ, గాయత్రీదేవి సహస్రనామ కుంకుమార్చన, మహామంగళహారతి, భజన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో పాల్గొని పూజలుచేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, ఆలయ డైరెక్టర్, ఉత్సవ కమిటీ సభ్యులు,ఆలయ సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు. ఆలయంలో మహేశ్వరం గ్రామానికి చెందిన అల్లె సుజాత-సత్తయ్య దంపతులు హోమంలో పాల్గొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


మహేశ్వరం: గాయత్రీదేవిగా అమ్మవారు

అన్నపూర్ణ దేవిగా అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో శరన్నవరాత్రి వేడుకలు కొనసాగుతున్నాయి. మూడోరోజు శనివారం అమ్మవారు అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆలయంలో మహాయజ్ఞం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, అర్చకులు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


మీర్‌పేట: అమ్మవారి పూజలో పాల్గొన్న కాలనీవాసులు

‘రైతుధర్నా నిర్వహించడం సిగ్గుచేటు’

కందుకూరు: రైతుధర్నా పేరుతో సబితారెడ్డి, కేటీఆర్‌తో కలిసి ధర్నా నిర్వహించడం సిగ్గుచేటని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి విమర్శించారు. శనివారం కందుకూరులో నాయకులతో కలిసి మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రూ.1లక్ష రుణమాఫీ చేస్తామని 2018 ఎన్నికల్లో గెలిచారని, 2023 ఎన్నికలకు ముందు కొద్దిమందికి మాఫీ చేసి ఇప్పుడు నాటకాలు ఆడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దమ్ముంటే కందుకూరు సొసైటీలో రికార్డులను పరిశీలిస్తే విషయాలు తెలుస్తాయన్నారు. ఎంతమందికి వారి హయాంలో మాఫీ చేశారో తేట తెల్లమవుతుందన్నారు. ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేసిన రేవంత్‌రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలుపుతుంటే.. బీఆర్‌ఎస్ మాత్రం విమర్శిస్తోందని మండిపడ్డారు. నాడు హుడా పేరుతో అక్రమంగా అనుమతులు ఇచ్చి, ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ హైడ్రా పేరుతో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తుంటే పేద ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకొంటున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో సబితారెడ్డికి డిపాజిట్ కూడా రాదని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ మండల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోరుప్రోలు రాణాప్రతాప్‌రెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ బొక్క భూపాల్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి

క్రీడాకారులను ప్రోత్సహించాలి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: చిన్నారులను చదువుతో పాటు వారికి ఆసక్తి ఉన్న క్రీడారంగంలో ప్రోత్సహించాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ సూచించారు. ఈ నెల7, 8వ తేదిల్లో మున్సిపాలిటీ కేంద్రంలోని తెలంగాణ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ స్కేటింగ్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులు కేఎల్లార్‌ను శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కేటింగ్ పోటీలకు వచ్చే చిన్నారులు, వారి తల్లిదండ్రులకు నిర్వాహకులు మౌలిక వసతులు సమకూర్చాలన్నారు. ఇలాంటి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎడ్ల శ్రీశైలంయాదవ్, శ్రీనివాస్, సత్యం, శివరాజ్, తదితరులు పాల్గొన్నారు.


కేఎల్లార్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

బాలాపూర్ లడ్డూ ఢిల్లీకి..

ప్రధానికి అందజేసేందుకు బయలుదేరిన శంకర్‌రెడ్డి


బాలాపూర్ లడ్డూతో కొలన్ శంకర్‌రెడ్డి

బడంగ్‌పేట్: బాలాపూర్ లడ్డూను ప్రధాని మోదీకి కానుకగా అందజేసేందుకు సింగిల్ విండో మాజీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి శనివారం ఢిల్లీకి వెళ్లారు. ఈ ఏడాది బాలాపూర్ గణనాథుడి లడ్డూ వేలంలో పాల్గొన్న ఆయన.. రూ.30.1లక్షలకు దక్కించుకున్నారు. ఈ లడ్డూను దేశానికి సుపరిపాలన అందిస్తున్న ప్రధాని మోదీకి ఇస్తానని వేలంలో ప్రకటించారు. ఇదే విషయాన్ని కేంద్ర మంత్రులకు చెప్పడంతో వారు శంకర్‌రెడ్డికి అపాయింట్‌మెంట్ ఇప్పించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయన పార్టీ నాయకులతో కలిసి బయలుదేరారు.

కేటీఆర్‌కు స్వాగతం పలికిన నాయకులు

తుక్కుగూడ: రాష్ట్రంలో రైతులకు ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కందుకూరులో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ పరిధిలోని ఆయా గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు మాజీ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి నాయకత్వంలో అధిక సంఖ్యలో తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి కేటీఆర్‌కు తుక్కుగూడ యువజన సంఘం అధ్యక్షుడు కీసరి శ్యామేల్‌రాజు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న యువజన సంఘం అధ్యక్షుడు రాజు

అలంకారప్రాయంగా స్ట్రీట్‌లైట్లు

ఏర్పాటు చేసి నెలలు గడిచినా ప్రారంభించని అధికారులు

తుక్కుగూడ: వీధి దీపాలు వృథాగా మారాయి. లక్షల రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన లైట్లు.. ప్రారంభానికి నోచుకోక అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఇదీ మున్సిపాలిటీ పరిధి తుక్కుగూడ నుంచి సర్దార్‌నగర్ వెళ్లే రోడ్డులో నెలకొన్న పరిస్థితి. హెచ్‌ఎండీఏ నిధులు నుంచి వీధి దీపాలను ఏర్పాటు చేశారు. విద్యుత్ కనెక్షన్, లైట్లను బిగించి నెలలు గడుస్తున్నా.. సంబంధిత అధికారులు ఉపయోగంలోకి తేవడం లేదు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. చీకటి పడిందంటే ఎదురెదురుగా వచ్చే వాహనాల వెళ్తురులో కష్టంగా మారిందని వాహన చోదకులు, పాదచారులు పేర్కొంటున్నారు. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన స్ట్రీట్‌లైట్లును హెచ్‌ఎండీఏ అధికారులు వినియోగంలోకి తేకపోవడంతో ప్రజాధనం వృథా అయిందని ఆరోపించారు. అధికారులు స్పందించి లైట్లను ప్రారంభించాలని కోరుతున్నారు. ఇదే విషయంపై మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. లైట్లు ఏర్పాటు చేసి నెలలు గడిచిందని, త్వరగా వినియోగంలోకి తేవాలన్నారు.


తుక్కుగూడ-సర్దార్‌నగర్ రహదారిలో ఏర్పాటు చేసిన వీధి దీపాలు

పేద విద్యార్థికి చేయూత

చేవెళ్ల: ఎంబీబీఎస్ ఫ్రీ సీటు సాధించిన పేద విద్యార్థికి చేవెళ్లకు చెందిన బీజేపీ యువ నాయకుడు మాజీ ఎంపీపీ కుమారుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు. శనివారం చేవెళ్లకు చెందిన పారిశుధ్య కార్మికుడు సాయన్న సుజాతల కూతురు హిందూ ఇటీవల జరిగిన నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి కాళోజీ మెడికల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ ఫ్రీ సీటు సాధించింది. ఈ సందర్భంగా చేవెళ్లకు చెందిన డాక్టర్ మాల్గారి వైభవ్‌రెడ్డి పేద విద్యార్థి ఉన్నత చదువు కోసం తనవంతుగా లక్ష రూపాయలను ఇస్తానని ప్రకటించి ఇచ్చిన మాట ప్రకారం విద్యార్థిని కలిసి కుటుంబసభ్యులకు మాజీ ఎంపీపీ ఎం. విజయలక్ష్మి చేతుల మీదుగా నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తూనే పిల్లలను ఉన్నత చదువులు చదివించిన సాయన్న దంపతులను అభినందించారు. ప్రతిభ గల పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయుతనందించాలని కోరారు. ఎంబీబీఎస్ ఫ్రీ సీటు రావటం ఎంతో సంతోషకరమన్నారు. ఒక డాక్టర్‌గా తనకు తెలిసి పేద విద్యార్థి చదువుకు ఎలాంటి ఇబ్బంది ఉండకూడదని ఆలోచనతో తనవంతు సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థి కుటుంబసభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.


విద్యార్థినికి నగదు అందజేస్తున్న నాయకుడు డాక్టర్ మాల్గారి వైభవ్‌రెడ్డి

ఘనంగా బతుకమ్మ సంబురాలు


బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థులు

మహేశ్వరం: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జంగయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు, పండుగల గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థికి పండుగల ప్రాధాన్యతను తెలిపేందుకే కళాశాలలో సంబురాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అంతకుముందు విద్యార్థులకు పండుగల గురించి వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులు రంగురంగుల పూలతో బతుకమ్మలు తయారుచేసి కళాశాల ఆవరణలో బతుకమ్మ ఆడి చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలింతలకు పౌష్టికాహారం అందజేయాలి

షాద్‌నగర్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయానికి పౌష్టికాహారాన్ని అందజేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రుషికేశ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. గుడ్లు, పాలు, బాలామృతం పంపిణీలో జాప్యం వలన బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదన్నారు. పౌష్టికాహార లోపంతో వారు బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఐసీడీఎస్.. అంగన్‌వాడీ కేంద్రాలకు సరిపడా నిధులను సమకూరుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించడంలేదని విమర్శించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు వెంటనే అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి సమయానికి పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

మహాసభకు తరలిన రైతులు

మొయినాబాద్‌రూరల్: కామారెడ్డిలో శనివారం జరిగిన భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర మహాసభకు మండలం నుంచి రైతులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా శనివారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో రైతులందరినీ ఏకం చేసిన భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు సామ మాధవరెడ్డి రైతుల ఐక్యత వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసేందుకే కామారెడ్డిలో భారతీయ కిసాన్ సంఘ్ మహాసభను నిర్వహిస్తున్నామన్నారు. రైతు భరోసా, వరికి ఐదు వందల బోనస్, ధరణి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు సుధాకర్‌రెడ్డి, శంకర్, ఈగ వెంకట్‌రెడ్డి, తోల్‌కట్ట శంకర్, శ్రీనివాస్, సుధాకర్, కేతిరెడ్డిపల్లి కృష్ణా, నర్సింహారెడ్డి, శివ, ఆయా గ్రామాల రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


మహాసభకు తరలిన రైతులు, నాయకులు

ముగిసిన క్రీడాపోటీలు


వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

మొయినాబాద్: మండల కేంద్రంలో ఐదురోజులపాటు జరిగిన క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. మండల కేంద్రంలో మెథడిస్ట్ జిల్లా యూత్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో వివిధ క్రీడాపోటీలు జరిగాయి. జిల్లాలోని 29 చర్చీలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, డప్పు రాజు, భీంరాజ్, శ్రీధర్, ప్రవీణ్, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు వర్తింపజేస్తాం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: రాష్ట్రంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డిజిటల్ కార్డుల ఇంటింటి సర్వేను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులందరికీ అందేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ కార్డుల ద్వారా ప్రజలు రేషన్, హెల్త్, ఇతర పథకాలను సులువుగా వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం డిజిటల్ కార్డుల జారీని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు వివరించారు. అధికారులు అర్హుల జాబితాలో వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని కోరారు. డిజిటల్ కార్డుల ద్వారా పలు పథకాల్లో అక్రమాలను పూర్తిగా నిరోధించే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా అమలు చేస్తుందని, పార్టీకి ప్రజల్లో నుంచి వస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు తమ ఉనికిని కాపాడుకోవడానికి ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, నాయకులు సుదర్శన్‌గౌడ్, నవీన్‌చారి, శ్రీను, హరినాథ్‌రెడ్డి, దయానంద్ గుప్తా, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డిజిటల్ కార్డుల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

రైతుల సమస్యలు పరిష్కరించాలి

షాబాద్: రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గజేందర్‌గౌడ్ అన్నారు. శనివారం కామారెడ్డిలో జరిగిన రాష్ట్ర మహాసభలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గజేందర్‌గౌడ్ ఎన్నికయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు విద్యుత్, మార్కెటింగ్, రెవెన్యూ సమస్యలతో సతమవుతున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో భూముల ఫిజికల్ సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. సమస్యల పరిష్కారానికి రానున్న మూడు సంవత్సరాల కాలంలో ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో లక్ష సభ్యత్వంతో పటిష్టంగా ఉన్న భారతీయ కిసాన్ సంఘ్ రైతుల పక్షాన ప్రభుత్వంపై పోరాడేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.